# కాశ్మీర గాథలు

## రెంటాల గోపాలకృష్ణ

శ్రీమంతమై, సకలజనమనోభిరామమై, సిరి వెన్నెలలు కాసే భారతావనికి శిరోభూషణం కాశ్మీరం. కాశ్మీరం అంటే కుంకుమ పువ్వు అని అర్థం. ఈ పంట అక్కడ ఎక్కువగా పండిస్తారు. అందుచేతనే కుంకుమపువ్వుకు 'కాశ్మీర జన్మ' అనే పేరు సార్థకమైంది.

అతి ప్రాచీనమైన కాశ్మీరాన్ని గురించి ఎన్నెన్నో కథలున్నాయి. ఎంతో చరిత్ర వుంది. పురాణ గాథలు కోకొల్లలు. ఒకప్పుడు హిమశైలం చెంత 'సతి' అనే సరోవరం వుండేది. మహాసాగరం వంటి ఆ సరోవర గర్భంలో జలోద్భవుడనే రక్కసుడుండేవాడు. ఆరు మన్వంతరాలకాలం ఆ హిమవన్నగ ప్రాంతమంతా జలపూర్ణమై వుంది.

అనంతరం వైవస్వత మన్వంతరంలో గరుడుల బాధ పడలేక శ్రీహరి ఆదేశానుసారం నాగరాజు వాసుకి నాగ సంతతితో 'సతీ' సరోవర ప్రాంతానికి వచ్చాడు. అయితే, అక్కడా నాగులకు సుఖశాంతులు లేక పోయాయి. జలగర్భంలో దాగివున్న రక్కసుడి బాధ ఎక్కువయింది. అప్పుడు అనంత నాగుని పంపించాడు విష్ణుమూర్తి. ఆ సర్పరాజు హిమగిరికి పెద్ద రంధ్రంచేసి సతీ సరోవరంలోని జలమంతా పర్వత గర్భంలోకి చేర్చాడు. నీరు యింకిపోయిన సరోవరం నుండి జలోద్భవుడు బయటికి వచ్చాడు. ప్రజాపతి కశ్యపుడు ఇంద్రాది దేవతలను పంపి ఆ రాక్షసాధముని చంపి అక్కడ కాశ్మీర మండలాన్ని నిర్మించాడు. ఆ విధంగా అవతరించిన కాశ్మీరం నాగజాతికి ఆవాసమైంది. ఆ దివ్యభూమి 'సతీదేవి' రూపమనీ, దాన్ని పాలించేరాజు 'శివాంశ' సంభూతుడనీ భావించేవారు.

కాశ్మీరంలోని హిమగిరి గుహలలో ప్రాదుర్భవించిన నేవనది వితస్తానది. అది, కాశ్మీర కాంతకు పాపిటలా భాసిస్తూ వుండేది. స్వచ్ఛ నీలమణి కాంతితో ప్రకాశించే ఆ పవిత్ర నదీ జలాలలో చిన్న గింజ పడవేసినా, అది అడుగు వరకూ వెళ్ళడం కనిపిస్తుంది. నదికి ఇరువైపులా పుణ్య తీర్థాలూ, క్షేత్రాలూ వెలిశాయి. పుణ్య జలంతో పునీతమైన పుడమి తల్లి కాశ్మీరం. అక్కడ పవిత్ర స్థలంకాని ప్రదేశం గోష్పాదమంత అయినా లేదు. అక్కడ అందమంతా గూడు కట్టుకుని వుంటుంది. అద్భుత విశేషాలకు ఆటపట్టు అది. కళ, సాహిత్యాలకు కాణాచి అయి, పండిత ప్రకాండులకు పుట్టినిల్లయి, ప్రకృతి రామణీయకతకు ప్రసిద్ధమై అలరారుతూ వున్న కాశ్మీరమండలాన్ని పుణ్య ఫలంతో తప్ప, భుజబలంతో జయించడం సాధ్య కాదు. ఈ భూతల స్వర్గాన్ని ఎందరో రాజాధిరాజులు పాలించారు. వారు దివ్య ప్రభావులు, భవ్య చరిత్రులు.

తొలి ప్రభువు నీలుడనే నాగరాజు. అతడు నీల మత పురాణకర్త. నాగులు జప, హోమ, యజ్ఞ, యాగాది క్రియలకు పెట్టింది పేరు. అయితే, కాలక్రమేణా బౌద్ధం ప్రబలింది. హిందూ దేవాలయాలకు తోడు బౌద్ధ విహారాలూ, చైత్యాలు వెలిశాయి. హిందువులకూ బౌద్ధులకూ తరచుగా కలహాలు సంభవిస్తూ కాశ్మీరం కల్లోలిత మైంది. కాలం తెచ్చిపెట్టిన దుర్ఘటనలు ఎంతగా మార్చివేసినా ఆసియాలోని విభిన్న సంస్కృతులు సంగ మించినవి ఇక్కడే. ఇండో-ఆర్యన్ సంప్రదాయాలను పుణికి పుచ్చుకున్న భూమి కాశ్మీరం.

### చంద్రాపీడుని వైభవం

ఒకానొక కాలంలో చంద్రాపీడుడు అనే రాజు కాశ్మీరాన్ని పాలించాడు. కీర్తినే కిరీటంగా ధరించిన ప్రభువతను. ధగద్ధగాయమానమైన అతని కీర్తి కాంతులు దశదిశలూ ఆక్రమించాయి. మాలిన్యమనే చీకట్లను మాపివేశాయి. వాసుదేవుడు పాండవ పక్షపాతి అయినట్లుగా అతడు ధర్మపక్షపాతి. కలికాలంలో ఏకపాదంపై నిలిచిన ధర్మం ఆ భూదేవుని ప్రభావం వలన తక్కిన మూడు పాదాలనూ సంతరించుకున్నది. చెట్లనుండి పండ్లను రాల్చినట్లుగా శత్రువుల శిరస్సులను కూల్చిన అకుంఠిత పరాక్రమ శాలి చంద్రాపీడుడు.

కుబేరుడి నవ నిధులు ఒకవంక, అతని సద్గుణ సంపద ఒక వంక త్రాసులో పెట్టి తూచినప్పుడు ఆ రాజు గుణ సంపద భారంగా వున్నదట.

దానంలో కర్ణుణ్ణి మరపిస్తాడు. వినయంలో అతన్ని చెప్పి మరొకర్ని చెప్పాలి. అటు ప్రజలూ, ఇటు అమాత్యులూ తన గుణ గణాలను పేర్కొని ప్రస్తుతిస్తూ వుంటే లజ్జతో కుంచించుకుపోతాడు ఆ మహారాజు.

భక్తి, దాన్ని మించిన భక్తిగల చంద్రాపీడుడికి శ్రీ మహావిష్ణువుకు ఒక దివ్యాలయం నిర్మించాలన్న సంకల్పం కలిగింది. అందుకు అనువైన స్థలం కోసం అన్వేషించడం మొదలు పెట్టాడు. వెదుకగా, వెదుకగా ఒక ప్రదేశం ఆయనకు నచ్చింది. అయితే, అక్కడ ఒక చర్మకారుడు గుడిసె వేసుకుని వుంటున్నాడు. రాజోద్యోగులు అతని కడకు వెళ్ళి మహారాజు అభిమతాన్ని తెలిపారు.

"ఓయీ! నీ కుటీరాన్ని మరో చోటుకు మార్చుకో అందుకుగాను నీవు కోరినంత ధనం ఇస్తాము" అని అన్నారు. కాని చర్మకారుడు సమ్మతించలేదు. ఎంతగానో చెప్పి చూచారు రాజోద్యోగులు. అయినా అతను సనేమిరా కాదన్నాడు. ఆ విషయం ప్రభువుకు విన్నవించారు ఉద్యోగులు. చర్మకారుడిపై కొంచెమైనా ఆగ్రహం కలగలేదు చంద్రాపీడుడికి.

"ఆలయ నిర్మాణాన్ని ఆపివేయాలి, లేదా మరో ప్రదేశాన్ని అన్వేషించాలి. అంతేకాని, ఇతరుల నివాసాలను, అందునా పేదల గృహాలను బలవంతంగా నేజి చేజిక్కించుకోడం మహాపాపం" అన్నాడు ఆ మహారాజు. ప్రభువే అధర్మానికి పాల్పడితే, ఇంక లోకంలో న్యాయానికి స్థానం ఎక్కడుంది? అని ధర్మ విచారంలో మునిగిపోయారు.

రాజుగారి అభీష్టం ఎలాగైనా తీర్చాలని మంత్రులు ఒక దూతను చర్మకారుడి దగ్గరకు పంపారు. అతడు వెళ్ళి చెప్పవలసినదంతా చెప్పాడు. చివరకు ఆ చర్మకారుడు "అయ్యా! ఒకమాటు ప్రభువులను దర్శించే అవకాశం నాకు ఇప్పించండి. అందుకు నేను అర్హుణ్ణి కాదని అనుకుంటే, దేవరవారు ఇటువైపు వాహ్యాళికై వచ్చినప్పుడు నేనే వారిని సందర్శిస్తా" అన్నాడు.

వెంటనే దూతవెళ్ళి ఆ విషయం మహారాజు చంద్రాపీడుడికి చెప్పాడు. తరువాత ఆ మహీపాలుడు ఒకనాడు విహారార్థం బయటికి వెళ్ళినపుడు చర్మకారు

డికి దర్శనం ఇచ్చి "ఓయీ! ఈ కుటీరం మీద నీకెందుకింత ప్రీతి? నేను తలపెట్టింది దైవకార్యం. ఆలయ నిర్మాణార్థం ఈ స్థలాన్ని కోరుతున్నాను. నిజానికి కాశ్మీర మండలం అంతా నా అధీనంలో వుంది. అయినా, ప్రజలను పీడించిన ప్రభువుకు పీడ చుట్టుకుంటుంది కాబట్టి నీ అనుమతితోనే ఈ ప్రదేశాన్ని స్వాధీనం చేసుకోవలెనని నా నిశ్చయం. నీవు సుఖంగా నివసించడానికి ఏదైనా దివ్య భవనం కోరుకో ఇస్తాను. లేదా నీకోసం అందమైన భవనం నిర్మింపచేస్తాను. కాదంటే నువ్వు కోరినంత ధనం ఇస్తాను" అన్నాడు చంద్రాపీడుడు.


అది విని చర్మకారుడు "ప్రభూ! నా మనవి చిత్తగించండి. నేను హీనుడను. కడజాతి వాడను. దేవరవారు దైవాంశ సంభూతులు. వీరవిక్రమ క్షత్రియ సంజాతులు. కాని, మానవ దేహాలన్నీ ఒక్కటే. కాకుంటే ప్రభువులు కేయూరహారాది దివ్య భూషణాలు ధరించారు. నేను జీర్ణములైన మలిన వస్త్రాలు కట్టుకున్నాను. దేవరవారికీ నాకూ అహంకార, మమకారాదులు సమానమే. తమకు తమ దివ్య సౌధంపై ఎలా ప్రీతి ఉంటుందో, నాకు నా ఈ శిథిల కుటీరంపై అలా ప్రీతి ఉండడం సహజమే కదా! ప్రభూ! ఈ కుటీరంలోనే పుట్టి పెరిగాను నేను. ఇక్కడే కష్టాలూ సుఖాలూ అనుభవించాను. ఈ శరీరం మీద నాకు ఎంత మమకారం ఉందో, ఈ ఇంటి మీదా అంత మమకారం ఉంది. నేను చేసే అన్ని కర్మలకూ సాక్షి ఈ కుటీరం. ఇది నాకు తల్లి లాంటిది. దీన్ని విడిచి నేను బ్రతుకలేను ప్రభూ! మానవుడు తాను నివసించే ఇల్లు నష్టమైనప్పుడు పొందే దుఃఖం, రాజ్యం భ్రష్టమైనప్పుడు రాజు పొందే దుఃఖం కన్నా మిన్న అయినది. దానిని ఆ దేవతలు కూడా గ్రహించలేరు మహారాజా!" అని బదులు చెప్పాడు.

చంద్రాపీడుడు మారు మాటాడలేక మౌనంగా వుండి పోయినాడు. సజ్జనుడైన ఆ రాజు అపర ధర్మ దేవతలా అగుపించాడు చర్మ కారుడికి. ఆ తేజోమూర్తి ముఖ మండలంపై ఒకానొక నిస్సహాయత నీలి నీడలా క్రమ్ముకుంటున్నట్లు గోచరించగానే చర్మకారుడు "ప్రభూ! అర్థి జనులకు కల్పతరువులాంటి తమరు ఈ అల్పుడి గృహానికి విచ్చేసి అడుగుతున్నారు. జన్మ జన్మలకైనా లభ్యం కాని మహోత్కృష్ట దశ ఇప్పుడు నాకు లభించింది. నా కుటీరాన్నే కాదు, నా దేహాన్నైనా విడిచి పెట్టడం ఉచితమని నాకు తోస్తున్నది. ఇల్లు విడిచి వెళ్ళిపోతాను. ఈ ప్రదేశాన్ని మీ ఇష్టం వచ్చినట్లు వినియోగించుకోండి"–అని చెప్పాడు.

చంద్రాపీడుడి ముఖం వెలుగులు విరజిమ్ముతూ విప్పారింది. అంతులేని ధనం చర్మకారుడికి ఇప్పించి అతని కుటీరాన్ని పరిగ్రహించినాడు. అస్పృశ్యుడు అంజలి ఘటించి "మహాప్రభో! నీ ఔదార్యం అనుపమానమైనది. పూర్వం ధర్మ దేవత శునక రూపంలో వచ్చి ధర్మరాజుని పరీక్షించినట్లుగా చండాలుడనైన నేను మిమ్మల్ని పరీక్షించాను. మీ ధర్మ నిష్ఠ లోకానికి మార్గ దర్శకం అవుతుంది. రాజ్యరమతో పాటు జయలక్ష్మి కూడా మిమ్మల్ని ఎల్లప్పుడూ అంటిపెట్టుకుని ఉంటుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

అంతట చంద్రాపీడుడికి శ్మశాన వాసి అయిన ఆ శంకరుడే చర్మకారుడి రూపం తాల్చినట్లు తోచింది. సంతోషస్వాంతుడై ఆ ప్రదేశంలో దివ్యమైన ఆలయాన్ని నిర్మించాడు. అందులో విష్ణుమూర్తిని విధి విహితంగా ప్రతిష్ఠించాడు. ఆ దేవుడి పేరు త్రిభువన స్వామి. ఆ విధంగా పంచముడు వసించిన భూమిని పుణ్య క్షేత్రంగా మార్చినాడు చంద్రాపీడుడు. ఈ పుణ్య కార్యంలో చర్మకారుడికి కూడా భాగం ఉన్నదని సంతసించాడు.






## చంద్రా పీడుడి న్యాయవిరతి

ఇలా ఉండగా ఒకనాడు చంద్రాపీడ మహారాజు నిజ మంత్రి సామంతాదులతో కొలువు తీర్చి ఉన్నాడు. అప్పుడు ఒక బ్రాహ్మణ స్త్రీ అక్కడికి వచ్చింది.

"చంద్రా పీడ రాజచంద్రా! నీవు ఈ పుడమిని నిష్కంటకంగా పాలిస్తున్నావు. ధర్మాన్ని పరిరక్షిస్తున్న మహారాజువు నీవు. కాని సుఖ నిద్రలో ఉన్న నా భర్తను ఆకస్మికంగా ఎవడో వధించి వెళ్ళాడు. నీ పరిపాలనలో ఇంత కాలానికి ఈ అన్యాయం జరిగింది మహాప్రభో! నా పతి అకాల మృత్యువాత పడడానికి హేతువేమిటి? నా భర్తకు విరోధులెవ్వరూ లేరు. నిర్దోషి అయిన నా పతి నిష్కారణంగా మరణించాడు. అయినా నా మన స్సుకు ఒక ఊహ తడుతూ వుంది. ఒక బ్రాహ్మణు డున్నాడు. అతడు మక్షికస్వామి. నా భర్త అతనూ సమాన వయస్కులు. ఇరువురూ సహాధ్యాయులు. అయితే అతడు మందమతి. నా పతి బుద్ధి కుశలతను, విద్యా నైపుణ్యాన్ని చూసి అతను అసూయ పడుతూ ఉంటాడు. క్షుద్ర విద్యలు నేర్చిన మక్షిక స్వామి నా భర్తను చంపి ఉంటాడని నా అనుమానం. ప్రభువులు విచారించి నాకు న్యాయం చేకూర్చండి"- అని పలికింది ఆ విప్ర పత్ని.

ఆమె మాటలు విని చంద్రా పీడుడు వెంటనే 'మక్షికస్వామిని' పిలిపించి "ఓయీ! నీ పై బ్రాహ్మణి భర్తను చంపినట్లు నీపై అభియోగం వచ్చింది. నీవు నీ నిర్దోషిత్వం రుజువు చేసుకోడానికి అగ్ని ప్రవేశం లాంటి పరీక్షలకు గురి కావలసి వుంది"-అన్నాడు.



## బి.యన్. భాషితాలు

అయినవాడి కొరకు
కానివాడిని కష్టాలపాలు చేయకండి
ఒకడి బాగు కొరకు మరొకడి
భవిష్యత్తును బలి చేయకండి—

** ** **

కాస్త స్వార్థమే లేకపోతే
మనిషికి మనుగడే లేదు
స్వార్థమే జీవిత పరమార్థమైతే
మనిషి లేదు, మనుగడ లేదు—

** ** **

జీవితంలో కష్టాలు భరించలేక
చావును కోరుకున్నాను
మృత్యువొచ్చి ముంగిట నిలిస్తే కానీ
అర్థం కాలేదు చావడం ఎంత కష్టమో—

** ** **

జీవించినంతకాలం నాపై
రాళ్ళు వేసిన యీ ప్రపంచం
కళ్ళ కద్దుకుంటున్నది నా మృతదేహాన్ని-
నెత్తిన పెట్టుకొని మోస్తున్నది నా శవాన్ని—

** ** **

కారులో ప్రయాణం చేసే ఖరీదైన బాబూ
ప్రమాద భరిత మీ జీవితం
రేసు కారులా దూసుకు పోకు
ప్రమాదాలు చేసి ప్రజల ప్రాణాలు తీయకు—

** ** **

మనిషి ముందర ఓ తీయని మాట
మనిషి వెనుక ఓ ఘాటు పోటు
ఈ మాటలే పోటులై నీ భరతం పడ్తే
పుట్టగతులుండవు భారత పుత్రా—

** ** **

మట్టిలో కలిసిపోయే ముందు
మంచి పనులు కొన్ని చేయండి
ఒక ఇంటిలో దీపం పెట్టండి
ఒక అభాగ్యుడి జీవితంలో ఆహ్లాదం నింపండి—

** ** **

అది విని బ్రాహ్మణి "రాజేంద్రా! అభిచార క్రియా నిపుణుల పట్ల ఇలాటి పరీక్షలు నిష్ఫలం" అని అన్నది.

అప్పుడా రాజు "అమ్మా! అయితే ఇతడు అపరాధి అని నిర్ణయించడం ఎలా? అపరాధి అని తేలినప్పుడే కదా దండించడం?" అని అడిగాడు.

అందులకా ద్విజపత్ని "రాజా! ఇప్పటికి నాలుగు రోజులుగా నేను అన్నపానాలు మాని ఉన్నాను. భర్తనే అనుసరించాలనుకున్నాను. నా భర్త హంతకుని మీరు దండించనిచో నేను ఈ నిరాహార దీక్ష లోనే ప్రాణాలు త్యజిస్తాను" అని బదులు చెప్పింది.

చంద్రా పీడుడికి ఏం చేయాలో తోచలేదు. దోషి ఎవరో తెలియలేదు. నిర్దోషిని శిక్షిస్తే మహా పాపం.

ఎటూ పాలుపోక తుదకు తను కూడా నిరశన దీక్షకు పూనుకొన్నాడు. అలా ఆరాజు శ్రీహరిని ధ్యానిస్తూ ఆలయంలో దీక్షా వ్రతుడైనాడు. మూడవ నాడు ప్రదోష సమయంలో మహావిష్ణువు కలలో ఆరాజుకు కనిపించి "రాజా! నీ దీక్షకూ, ధర్మనిరతికీ మెచ్చాను. ఈ ఆలయం ముంగిట వరి పిండి చల్లించు. దోషిగా అనుమానించబడుతున్న బ్రాహ్మణుని ఆ పిండి మీద నడుస్తూ ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేయమను. అప్పుడా విప్రుడి పాద ముద్రల వెంట మరో పాద ముద్ర కూడా కనిపించనట్లయితే, అతడు బ్రహ్మ హత్యా పాతకానికి పాల్పడినట్టు నిర్ధారించు"- అని చెప్పి అంతర్థానమైనాడు.

అంతట చంద్రా పీడుడు దోషిగా భావించబడు తున్న బ్రాహ్మణుని రావించి, అదే విధంగా పరీక్షిం చాడు. అతడే బ్రాహ్మణి భర్తను చంపినట్లు నిర్ధారణ అయింది. వెంటనే రాజు హంతకుడికి తగిన శిక్ష విధించాడు. బ్రాహ్మణి రాజును దీవించి యథేచ్ఛగా వెళ్ళిపోయింది. ఇలాంటి ధర్మదీక్షా పరతంత్రులైన రాజులు ఎందరో కాశ్మీరాన్ని పాలించి ప్రసిద్ధి కెక్కారు. ఆనాటి నుంచి కాశ్మీరంలో క్షుద్ర విద్యలు అనుష్ఠించే వారిని కఠినంగా దండిస్తామని చంద్రా పీడుడు శాసిం చాడు.

## నడుపల్లి శ్రీరామరాజుకి విశ్వనాథ సాహిత్య పీఠం అవార్డు

"ప్రతి సంవత్సరము శ్రీ విశ్వనాథ సాహిత్య పీఠం (కాకినాడ) నిర్వహించే ఉత్తమ సాహిత్య విమర్శల పోటీలో ఈ సంవత్సరం డాక్టరు నడుపల్లి శ్రీరామరాజు; (ఎం.ఎ.,పిహెచ్.డి., పి.జి.డిప్. ఇన్ లాంగ్వేజ్ ఆంధ్రోపన్యాసకులు కేంద్రీయ విశ్వవిద్యాలయం, హైదరాబాద్) వ్రాసిన "అక్షర విశ్వనాథ" అన్న గ్రంథం ఉత్తమమైనదిగా నిర్ణయింపబడినది. ఇది విశ్వనాథవారి మధ్యాక్కరలపై విమర్శ గ్రంథము అని పీఠం సంచాలకులు శ్రీ పేరాల భరత శర్మ తెలిపారు.

ఈ పీఠం ప్రథమ పీఠాధిపతి శ్రీ వెంపరాల సూర్య నారాయణశాస్త్రిగారి నిర్యాణానంతరం శ్రీ మల్లంపల్లి శరభయ్య పీఠాధిపత్యం వహిస్తున్నారు.

---

తలచిన పని తలచినట్లుగా కాలేదని
తలపట్టుకొని కూర్చుంటే అవుతుందా?
తల తాకట్టుపెట్టో తలనీలాలిచ్చో
సాధించాలి నీ ధ్యేయం—

** ** **

జీవితమనే పరుగుపందెంలో
బోల్తా పడేలా పరుగెత్తకు
ఎంత దూరం పరిగెత్తినా
చివరి పరుగు సమాధివరకే—

** ** **

అష్ట ఐశ్వర్యములున్నా
అనంతమైన శక్తి సామర్థ్యములున్నా
అంతఃకరణశుద్ధి లేకపోతే
శృంగభంగము తప్పదన్నా—

** ** **

కష్టాలెన్ని వచ్చినా
నష్టాలెన్నో భరించినా
కన్నీళ్ళు తుడ్చే ఆప్తుడు
కనీసం ఒకడుంటే చాలు—

** ** **

డబ్బుంటే పవర్ కావాలి
పవర్ కావాలంటే పాలిటిక్సులో చేరాలి
డబ్బుండి పవర్ లేకపోతే అన్నం రుచించదు
పవరుండి డబ్బు రాకపోతే నిద్రపట్టదు—

** ** **

చెప్పలేనని ఏడ్చేవాడికి
కాళ్ళులేని వాడు కనిపించేవరకు
అర్థం కాలేదట తానెంతటి
అదృష్టవంతుడో—

** ** **

ఒక చెంప మీద కొట్టినపుడు
మరో చెంప చూపమన్నారు పెద్దలు
ఆ సూత్రం పనిచేయనపుడు
కొట్టినవాడి రెండు చెంపలు
వాయగొట్టడమే న్యాయం—

** ** **

ఇహ పరాల గురించిన చర్చలతో
ఇందుగలడందుగలడనే దండకంతో
నాలీచాలని కడుపులతో వస్తుండే
దరిద్రనారాయణుల కడుపులు ఎలా నింపగలము?

** ** **

జైలు జీవితమనుభవిస్తున్న ఇద్దరు ఖైదీలలో
ఒకడు కటకటాల వెనుక పడ్తున్న
కఠిన బాధలు తలుచుకొని కన్నీరు కారుస్తుంటే
మరొకడు అనంతాకాశంలోని
తారలను చూసి ఆనందించాడట

— వాస్తుశిల్పి బి.ఎన్. రెడ్డి